

# ఆకలి

**కొటిక మల్లయ్య**

**"అవ్వా! అవ్వా! మీ పెద్దవ్వ చచ్చిపోయిందే....!" ఆరిపోతున్న పొయ్యినంటుబెట్టడానికి సతమతమవుతున్న తల్లి దగ్గరికొచ్చి అంది రాధ.**

**తైల సంస్కారంలేని జుట్టు, మాసికలు పడ్డలంగా జాకెట్టుతో- కళ్ళు, డొక్క లోతుకుపోయి దారిద్ర్యానికి ప్రతిరూపంలా, ఆకలికి మరో రూపంలా ఉన్న కూతురు దిక్కు తలెత్తి చూసింది లచ్చమ్మ. పొయ్యి మీద నూకలన్నం తుకతుక ఉడుకుతుంది.**

ఆ వార్త లచ్చమ్మ కాశ్చర్యం కల్గించలేదు. ఆందోళనా కల్గించలేదు. ఎక్కడి పనులక్కడ వదిలిపెట్టి గబగబ పరుగెత్తుకుపోయేట్టూ చేయలేదు.

లచ్చమ్మ ఇంటికి నాలుగిళ్ల అవతలుండే ఆమె పెదతల్లి డెబ్బై ఐదేళ్ళ వృద్ధురాలు. ఏడాది నుంచి తన పనులు తాను చేసుకోకుండా మంచంలోనే పడి ఉంటుంది. దాదాపు పది రోజులుగా ఏ క్షణంలో పోతుందోన్నట్టుగా ఉంటుంది. గంట క్రితమే అక్కన్నుంచి వచ్చింది లచ్చమ్మ. ఆ రోజు గడవడం కష్టమనే అందరభిప్రాయపడ్డారు.

ఆ చావు అందరూహిస్తున్నదే కాబట్టి కూతురు చెప్పిన మాటల కామేం బాధ పడలేదు. కాని, ఆ మాటలు చెప్పిన తీరు ఆమె కాశ్చర్యకరంగా ఉంది.రాధ ప్రవర్తన ఆమెకు వింతగా తోస్తుంది. అదేదో శుభవార్తయినట్టు. అందుకోసమే ఇన్ని రోజులుగా ఎదిరి చూస్తున్నట్టు నంబరపడుతూ చావు కబురు చెప్పిన రాధపై ఆమెకు కోపంగా ఉంది.

రాధకు తన పెద్దతల్లిపై అంత కోపమెందుకో లచ్చమ్మ కర్థం కావడం లేదు. తన పెదతల్లి చావునామె ఎందుకు కోరుకుంటుందో ఆమెకు తోచడం లేదు.

"అవ్వా! అవ్వా! ముసల్దెప్పుడు చచ్చిపోతుందే...? వారం రోజుల్లో నాల్గుసార్లడిగి తల్లితో చివాట్లు తింది రాధ...

ఇతర్లను కూడా అడిగి తిట్లు తింది.

పొయ్యి మీది నుంచి అన్నం గిన్నె దించి క్రిందబెట్టింది లచ్చమ్మ.... నీళ్ళు చల్లి పొయ్యార్పుతున్న లచ్చమ్మ వారం రోజులుగా కూతురు ప్రవర్తన, తన పెదతల్లి చావు కొరకు ఎదిరిచూస్తున్న తీరు జ్ఞాపకం చేసుకుంది. ఎదురుగా నిల్చున్న కూతుర్ని సహ్యంగా చూసింది.

లేచి నిల్చుంది.

"అవ్వా! ముసల్ది చచ్చిపోయిందంటె వినస్తలే దానే?"

ఏ మాత్రం బాధపడకుండా, పైగా సంతోషంగా చెబుతున్న కూతురు మెడలు వంచి వీపులో గుపీ గుపీమని నాలుగు గుద్దులు గుద్దింది లచ్చమ్మ.

"నా కడుపుల చెడబుట్టినవే. మా పెద్దమ్మ చచ్చిపోతే నీకు సంతోషమైతందా...? నీకేం నష్టం చేసిందే అది...? పో ముండ బైటికి పో...." అని గద్దిరించింది.

"ముసల్ది చచ్చిపోతే నేనేం జెయ్యాలె...?" అని ఏడుస్తూ ఇంట్లోంచి బయటకెళ్ళింది రాధ.

వడిసెల దెబ్బ తాకి నేలకూలిన కోకిల గుండెలవిసేలా ఏడుస్తుంటే- దాని అలసటను, బాధను, ఆవేదనను చూడకుండా, దాని ఆర్తనాదంలో కంఠంలోని మాధుర్యాన్ని చూస్తూ అదెంత హాయిగా ఉంది? అని మధుర భావన చేసే కొందరు నాగరికుల్లోని క్రౌర్యాన్ని తన కూతుర్లో చూస్తున్న లచ్చమ్మకు బాధాకరంగా ఉంది.

గుడిసె తలుపేసి, గొళ్ళెం పెటి పెద్దమ్మింటి దిక్కు నడుస్తుంది లచ్చమ్మ.

'లచ్చమ్మది నిరుపేద కుటుంబం. పొట్టగడవడమే కష్టమవుతున్న దారిద్ర్యాన్ననుభవిస్తున్న కుటుంబం. దానికి తోడు ఊహ తెలియని ఇద్దరు పిల్లలను వదిలిపెట్టి ఆమె భర్త నాలుగేళ్ళ క్రితమే చనిపోయాడు. ఈ నాలుగేళ్ళుగా మరింత దారిద్ర్యాన్ననుభవిస్తుందామె కుటుంబం. ఆమె, ఆమె పిల్లలెప్పుడూ కడుపునిండ తిన్నది లేదు. కమ్మని భోజనాన్ని రుచి చూసింది లేదు. లచ్చమ్మ పెద తల్లిది ఓ తీరుగా గడుస్తున్న కుటుంబం. ఊళ్ళోనే ఉండే చెల్లెలు కూతురుపై ఆ వృద్ధురాయికి కొంత ప్రేముండేది. లచ్చమ్మ భర్త చనిపోయిం తర్వాత ఆమె కుటుంబానికి కొంత కొంత సాయం చేస్తుండేదా వృద్ధురాలు. తన కొడుకులకు తెలియకుండా పదీ, ఇరవై ఇస్తుండేది. రాధను దగ్గరకు తీసుకునేది. ఏదైనా మంచి సంబంధం చూసి పెళ్ళి చెయ్యాలనేది... పొట్ట కూటికే మొహం వాచి ఉన్న ఆ కుటుంబంపై ఆ వృద్ధురాలికి సానుభూతుండేది.''

పెద తల్లి మరణం వల్ల కలిగిన దుఃఖంతో కడుపులోంచి సొద తన్నుకొస్తుంటే-ఆ వృద్ధురాలి చావును కోరిన కూతురుపై అసహ్యం కల్గుతుంటే మతాన్ని మననం చేసుకుంటూ నడుస్తుంది లచ్చమ్మ. రాధ కా వృద్ధురాలిపై ద్వేషమెందుకో ఆమె కెంత ఆలోచించినా అర్థం కావడం లేదు. పన్నెండేళ్ళు కూడా లేని ఆ పసిది ఆ

చావునెందుకు కోరుకుందో లచ్చమ్మ ఊహకందడం లేదు. తన పెదతల్లి చనిపోయిందన్న చావు కబురును అంత సంబరపడుతూ ఎందుకు చెప్పిందో? ఆమె కనుకొలుకుల్నుండి ఒక్క కన్నీటి చుక్క కూడా ఎందుకు రావడం లేదో ఆమె కర్థం కావడం లేదు. తమకేం ద్రోహం చేసిందని రాధకా వృద్ధురాలిపై అంత కోపమో లచ్చమ్మ కెంత తలబ్రద్దలు కొట్టుకొని ఆలోచించినా అర్థమవడం లేదు.

రాజకీయ నాయకులు తమ స్వార్థం కొరకు, రాజకీయ ప్రయోజనాల కొరకు ఎంతటి విధ్వంసానికైనా పాల్పడుతారు. ఉద్యమకారులు తమ ఉద్యమ ప్రయోజనాల కోసం అంతులేని విధ్వంసాన్ని సృష్టిస్తున్నారు. కొందరు ఆస్తుల కొరకు మానవ సంబంధాలనే విధ్వంసం చేస్తున్నారు. మరికొందరు డబ్బు కోసం విలువలను విధ్వంసం చేస్తున్నారు. రకరకాల ప్రయోజనాల కోసం మనుష్యుల ఆస్తుల నష్టం, హత్యలు, అలజడి సృష్టిస్తున్నారు. కొందరు ఆస్తుల కొరకు ఇతర్ల చావును కోరుకుంటుంటే, మరికొందరు మరో ప్రయోజనం కోసం విధ్వంసం కోరుకుంటున్నారు.

మరి రాధ ఏం కోరి తన అమ్మమ్మ చావును కోరుకుందో లచ్చమ్మ కర్థం కావడం లేదు. ఏ ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకొని ఆ పిల్ల అమ్మమ్మ చావనే విధ్వంసాన్ని కోరుకుంటుందో ఆమెకు తెలియడం లేదు.

లోలోపలే కూతుర్ని తిట్టుకుంటూ, కన్నీరు తుడుచుకుంటూ పెదతల్లి ఇల్లు చేరుకుంది లచ్చమ్మ. వాకిట్లో వరిగడ్డేసి దానిపై శవాన్ని పడుకోపెట్టి పై నుంచి తెల్లబట్ట కప్పుంచారు. శవం చుట్టూ జనం. శవంపైబడి ఆ వృద్ధురాలి కూతుర్లు రోదిస్తున్నారు. శవానికి కొంచెం దూరంలో అక్కడక్కడ కొంతమంది ఊరివాళ్ళు నిల్చునున్నారు.

"మునలవ్వ మంచిదుండె.."

"చేతికి ఎముకే లేదు మునలవ్వకు.."

"బహుగ బతికింది.. డెబ్బయేండ్లు దాటింది..'

కొడుకులను, బిడ్డలకు సమానంగా చూసుకుంది.."

ఆ వృద్ధురాలి గూర్చి రకరకాలుగా మాట్లాడుకుంటున్నారు.

లచ్చమ్మ వృద్ధురాలి కూతుర్లతోపాటు శవంపైబడి రోదిస్తుంది. కంటివెంట ధారాపాతంగా నీరు కారుతుండగా, హృదయ విదారకంగా ఏడుస్తున్నారంత. ఆ వృద్ధురాలి గుణగణాలను వర్ణిస్తూ, ఆమె చావు వల్ల జరిగిన నష్టాన్ని వల్లె వేస్తూ రాగాలు తీస్తూ శోకిస్తున్నారు. చావు అనివార్యమే అయినా, ఆమెదీలోకాన్ని విడిచి వెళ్లాల్సిన వయసే అయినా మె ఆత్మీయుల కా చావు తీరని దుఃఖాన్నే కల్గించింది. కంటికో కడివెడేదుస్తున్న లచ్చమ్మను, వృద్ధురాలి కూతుర్లను కొందరూరడిస్తున్నారు.

వాళ్ళు అల్లసాని వారి నాయికలా అల్లనల్లన ఏడ్వడం లేదు. తిమ్మన నాయికలా కలస్వనంతోనూ ఏడ్వడం లేదు. వాళ్ళ ఏడ్పులో లయబద్ధత లేదు. రాగం లేదు. కడుపు లోంచి వ్యధ తన్నుకొస్తుంటే పొగిలి పొగిలి ఏడుస్తున్నారు. ఆమె వి యోగం వల్ల కల్గిన దుఃఖభారాన్నితీర్చుకోవడానికిఆత్మీయంగా ఏడుస్తున్నారు.

ఊహ తెలిసిన పిల్లలూ ఏడుస్తున్నారు. కనీసం విచారంగా ఉన్నారు. కాని, అక్కడే ఉన్న రాధ ఏడ్వడం

'అదేమిటయ్యా ! సెట్‌మీద అలా రూపాయి నోట్లు వేలాడదేశావేం? అడిగాడు సినిమా డైరెక్టర్ ఆర్ట్ డైరెక్టర్‌ను.

అప్పుడా ఆర్ట్ డైరెక్టర్ 'మీరే కదసార్ ! మనం ఖర్చు పెట్టే ప్రతి రూపాయి తెరమీద కనపడాలని చెప్పారు' అన్నాడు.

అనంతపురం రమణ

లేదు. విచారంగా ఉన్నట్టూ లేదు. ఆమెను చూస్తుంటే శవాన్నెప్పుడు తీసుకెళ్తారా అని ఎదురు చూస్తున్నట్టుంది.

కొందరు శవ దహనం కోసం కట్టెలు శ్మశానంలోకి చేర్చే ఏర్పాట్లలో ఉన్నారు. కొందతు పాడె కడుతున్నారు. స్త్రీలు ఏడుస్తున్న వాళ్ళనోదారుస్తున్నారు. సాయంత్రం వరకు రావాల్సిన వాళ్ళంతా వచ్చేశారు. డప్పుల చప్పుడుతో శవాన్ని శ్మశానానికి తీసుకెళ్తున్నారు. ఆత్మీయుల రోదనలు మిన్నుముడుతున్నాయి. శవంపై బోలు ప్యాలాలు, చిల్లర డబ్బులు విసిరేస్తున్నారు. రాధ కూడా అందరితో పాటు శ్మశానానికెళ్తుంది. శవం దగ్గర నడుస్తుంది. శవంపై నుండి క్రిందపడ్తున్న బోలు ప్యాలాలను చేతికందినవి ఎవరూ గమనించకుండా తినడం చాలా సేవటి వరకెవరి దృష్టిలోనూ పడలేదు. శ్మశానం చేరుకుంటున్న సమయంలో రాధ చేస్తున్న పనిని ఒకామె చూసింది. నోటికొచ్చినట్టు తిట్టింది. కూతురు ప్రవర్తన తల తీసేసినట్టయింది లచ్చమ్మకు.

కొద్ది సేపట్లో శవంతో పాటు వాళ్ళంత శ్మశానం చేరుకున్నారు. ఈ సమాజంలో కొందరు మరణిస్తారు. మరికొందరు చస్తారు. ఉన్నవాడిది, పేరున్న వాడిది మరణం అవుతుంది. లేనివాడిది, ఏ పేరు లేనివాడిది చావవుతుంది. కొందరు పెంపుడు కుక్కల చావుకున్న ప్రాముఖ్యత కూడా మరికొందరి మనుమల చావుకుండదు.

కాని, శ్మశానం వీటన్నిటికీ అతీతం. రాజు పేద, యజమాని బానిన, మేధావి మూర్ఖుడు అనే తేడా లేకుండా తరతమ భేదాలు లేకుండా అందర్నీ తనలో లీనం చేసుకుంటుంది. ప్రపంచాన్నే గడగడలాడించిన నిరంకుశ ప్రభువులు, సువిశాల సామ్రాజ్యాలనేలిన రాజులు, పొట్టకూటికి లేని నిరుపేదలు, మహామహా తాత్త్విక గ్రంథాలను రాసిన తత్వవేత్తలు, కల్లు, సారాలకు బానిసలైన తాగుబోతులంతా ఈ శ్మశానంలోనే పిడికెడు బూడిదగా మిగిలిపోయారు.

తన వాళ్ళందర్నీ వదిలిపెట్టిపోయిన ఆ వృద్ధురాలు కొద్దిసేపట్లో శ్మశానంలో మంటలకాహుతైపోయింది.

ఆమె చావుకెంతమంది దుఃఖించినా రాధ కళ్ళ వెంట మాత్రం ఒక్క నీటి చుక్క కూడా రాలలేదు. ఈ విషయాన్ని అక్కడున్న చాలామంది గమనించారు.

చీకటయ్యేవరకు స్నానాలు ముగించి ఇంటికెళ్ళారు. ఇంట్లో శ్మశాన వైరాగ్యం చోటు చేసుకొనుంది. అరుగు మీద నిలబెట్టున్న వృద్ధురాలి నులకమంచం బోసిగా ఉంది.

తెల్లవారి చాలామంది బంధువులు వెళ్ళిపోయారు. పెద్దకర్మ నాటికి మళ్ళీ అందరు తిరిగొచ్చారు.

ఈ పదకొండు రోజులూ లచ్చమ్మ పెదతల్లి ఇంట్లోనే ఎక్కువగా గడిపింది. అన్ని పనులు తానై చేసింది. తల్లితో పాటు రాధ అక్కడే ఉంది. నువ్వెందుకొచ్చావే అని ఎంతమంది కసురుకున్నా వెళ్ళలేదు. పక్షికి పెట్టే రోజు, చిన్నకర్మ రోజు దాదావు అన్ని దినాల్లోనూ ఆ ఇంట్లోనే తింది. పెద్దలతో పాటు కల్లు కూడా తాగింది. అయితే ఆ వృద్ధురాలి కొరకొక్క కన్నీటి చుక్క కూడా ఇంతవరకు రాల్చలేదు. ఆమె వింత ప్రవర్తన కందరామె నసహ్యించుకున్నారు.

పెద్దకర్మ రోజున ప్రొద్దున్నే ఆ ఇంటికెళ్ళింది రాధ. పొయ్యిలపై మాంసం తుకతుక ఉడకడం చూసింది. పెద్ద పెద్ద అండాల్లో అన్నం వండడం గమనించింది. ఆ ఊరి వృద్ధురాలి కులం వాళ్ళు, బంధువులు, దగ్గరి వాళ్ళంతా భోజనానికొచ్చారు. కర్మకాండ పూర్తయిన తర్వాత అందరూ భోజనాలు చేశారు.

రాధ తిండి కోసమే అక్కడి కొచ్చినట్టుగా తింది. తిండి కోసమే పుట్టినట్టుగా, ఇదివరకెప్పుడూ తిండి మొహం చూడనట్టుగా, తిండే జీవిత లక్ష్యమైనట్టుగా పెద్ద కర్మ రోజున భోజనం చేసింది రాధ. "నాకన్నం బెట్టు... కూరెయ్యి..." అని అడిగి మరీ వేయించుకుంది.

ఆమె ప్రవర్తన అందరికి వింతగా ఉంది. ఆమె మనోభావాలెవరికీ అర్థం కావడం లేదు.

కర్మ ముగిసింది. సాయంత్రం అందరూ వెళ్ళడానికి సిద్ధంగా ఉన్నారు. ఈ పదకొండు రోజులుగా ఒక్క కన్నీటి చుక్క కూడా రాల్చని రాధ, కనీసం విచారంగా ఉన్నట్టు కూడా కనిపించని రాధ, పైగా ఆ చావుకు సంతోషిస్తున్నట్టు అందరి దృష్టిలో పడ్డ రాధ - ఇప్పుడు కంటికి మింటికి ఏకధారగా ఏడుస్తుంది. భోరుభోరున ఏడుస్తుంది. హృదయవిదారకంగా విలపిస్తుంది. తానే శోకదేవతైనట్టుగా రోదిస్తుంది. ఎంతమంది ఓదార్చినా ఊర్కోవడం లేదు.

వృద్ధురాలి చావుకెదురుచూసి, చనిపోయినప్పుడు సంతోషించి అంతా అయిపోయింతర్వాత విపరీతంగా ఏడుస్తున్న రాధ వాళ్ళకు విచిత్రంగా కనబడుతుంది.

ఆమె ఏడ్పును చూసి "దీనికేమన్న పిచ్చి పట్టిందా...?" అని కొందరు వెటకారమాడుతుంటే "అమ్మమ్మ జ్ఞాపకం వచ్చుంటుంది" అని మరికొందరు సానుభూతి చూపుతున్నారు.

అందరూ ఓదార్చగా, ఓదార్చగా ఏడ్చి ఏడ్చి ఊర్కుంది రాధ. కొద్దిసేపు గడిచిన తర్వాత ఒకాయనామెతో ఇలా అన్నాడు. "రాధా! మీ పెద్దమ్మమ్మ తొందరగా చనిపోవాలని కోరుకున్నావు. చనిపోతే సంతోషించావు. అంతా అయిపోయింతర్వాత ఇప్పుడెందుకింతగా ఏడుస్తున్నావు?

కొద్ది క్షణాలాగి అంది రాధ.

"పెద్దమ్మమ్మ చచ్చిపోతే పిట్టకు పెట్టినప్పుడు, చిన్న కర్మప్పుడు, పెద్దకర్మప్పుడు ఆల్లింట్లనే కడుపునిండా తినచ్చు. అందుకే ముసల్ది జెప్పున చచ్చిపోతే మంచి గుండనుకున్న. చచ్చిపోతె సంతోషవడ్డ. ఇన్ని రోజులు ఆల్లింట్ల కడుపునిండా బువ్వదిన్న. ఇయ్యాల్ల దినాలయిపాయె. రేపట్నుంచి కడుపునిండ బువ్వెట్ల దొరుకాలె? మా సుట్టాలల్ల చచ్చిపోయెటోల్లెవ్వలున్నరు? అందుకే ఏడువస్తంది...?

అక్కడున్న వారి హృదయాలు పిండినట్లయ్యాయి. ఎవ్వరి గొంతు పెగిలి ఒక్క మాట కూడా బయటకు రాలేదు. ఆ పావ కోరుకున్న విధ్వంసానికి కారణం 'ఆకలి' అన్న విషయం ఎవరికీ మింగుడుపడటంలేదు.

*